# స్పెషల్

పోతుల రవిశంకర్

ముందుగా-'ఏయ్ మిస్టర్.. ఇలారా" చిటికెలు వేసి తర్వాత చూపుడు వేలిని ముడిచి ముందుకీ వెనక్కీ ఊపుతూ పిలుపు...

"సర్"- ఎంతో వినయంగా బాయ్

"ఇది చికెన్ బిర్యానియేనా?"

"అవును సర్"-ఇంకా వినయం.

"మరి ఇలా వుందేం?"

"ఇది చైనీస్ ట్రైపులో చేసిందిసార్. టేస్ట్ చెయ్యండి సార్... చాలా బావుంటుంది ఒక్క ఈబార్‌లోనే ఇది స్పెషల్ ఇదిగోండి సర్...చికెన్ బిర్యానికి స్పెషల్ సూప్... ఇది కూడా చైనీస్ పద్ధతిలోనే చేసింది"

"సర్లే ... నీ దగ్గరం మాచ్ బాక్స్ ఉందా"

"ఉంది సార్... "

"ఇటివ్వు.... నువెళ్ళి రెండు ప్లేట్లు ఎగ్ ఫ్రై తీసుకురా...ఫ్రైమీద మసాలా పౌడరు స్ప్రేచేయొద్దు ఉల్లిపాయముక్కలు చల్లుకుని తీసుకురా...పో"

"అలాగే సర్..."

చివరికి-"బిల్లు సర్"

"ఎంత?"

"ఫిఫ్టీ సిక్స్ రూపీస్ సర్..."

"ఇవిగో డబ్బులు లెక్కపెట్టు"

"సిక్స్టీ రూపీస్ సర్..."

"కరెక్టేనా... ఎక్కువిచ్చానా?"

"లేదు సర్ కావాలంటే మీరు ఇంకోసారి చూడండి"

వద్దులే... ఆ నాలుగు రూపాయలూ టిప్ కింద నువ్వే ఉంచుకో...గుడ్‌బోయ్ ఈసారి వచ్చినప్పుడు కూడా నాకు నువ్వే సర్వ్ చెయ్యాలి... తెలిసిందా?"

"తప్పకుండా సార్. నమస్తే"

అప్పుడా మనిషి హుందాగా తల పంకించాడు; నవ్వుతూ ఊగుతూ బయటకు వెళ్ళిపోయాడు.

ఆ పెద్దమనిషి ఇంటికి వెళ్ళేసరికి ఆయన భార్యా పిల్లలు తిండిలేక ఆకలి కడుపులతో పస్తుపడుకుని వుంటారని శ్యామ్‌కు తెలిసి అతనికి అలాంటి మనుషులు బార్‌కు వచ్చి ప్రదర్శించే స్టైయిల్ బాగా నచ్చింది.

క్రమంగా శ్యామ్‌కు ఆ స్టైయిల్ మీద వున్న మోజు రోజురోజుకి పెరిగిపోయి చివరకు తనుకూడా ఓసారి ఏ బార్‌కైనా వెళ్ళి అంత స్టైయిల్‌గా షో చేయాలనే కోరిక తీవ్రంగా కలిగింది.

అలాంటి కోరిక కలిగిన తర్వాత జీతం తీసుకున్న రోజురాత్రి శ్యామ్‌సీట్‌గా

డ్రెసచేసుకుని ఆనగరంలో మరో ప్రాంతంలో ఎక్కడోవున్న నైట్‌క్వీన్ బార్‌లోకి స్టయిల్‌గావెళ్ళి మరింత స్టయిల్‌గా ఓ టేబిల్ ముందున్న కుర్చీలో కూర్చున్నాడు.

బేరర్ రాగానే స్టయిల్ గా అతన్ని చూసి స్టయిల్‌గానే అతన్ని రకరకాల ప్రశ్నలతో ఇబ్బంది పెట్టి తికమక చేశాడు.

ఇక్కడ మీరు సప్లయిచేసే మెక్‌డోవెల్ బ్రాందీ అసలుదేనా? నకిలీదా? దాని మాన్యుఫాక్చరింగ్ ఎక్కడ? మెడ్రాసేనా?

"ఇక్కడి చికెన్ ఫ్రై బావుంటుందా మటన్ బిర్యానికి ఎగ్ సూప్ ఇస్తారా?"

"ఫలానా బ్రాండ్ సిగరెట్లు దొరుకుతాయా? ఒకవేళ దొరక్కపోతే ఇంకే బ్రాండ్ సిగరెట్లు తీసుకొస్తావ్?"

"నీ దగ్గర అగ్గిపెట్టె వుందా?"

"నువ్వీ ఉద్యోగంలో చేరి ఎన్నాళ్ళయింది ఇక ఎప్పటికీ నువ్వీ ఈ ఉద్యోగంలోనే వుండిపోదామని అనుకుంటున్నావా?"

ఇలాంటి అవసరమయిన అనవసరమయిన ప్రశ్నలన్నింటినీ స్టయిల్‌గానే అడిగాడు శ్యామ్."

ఆ బేరర్ శ్యామ్ అడిగిన అన్ని ప్రశ్నలకూ "సర్" "సార్" అంటూ ఎంతో వినయంగా—మర్యాదగా జవాబులను చెప్పాడు.

చివరివరకూ స్టయిల్‌గానే బిహేవ్ చేసిన శ్యామ్ చివరగా ఐదు రూపాయలను ఆ బేరర్‌కు టిప్‌గా ట్రేలో వుంచి అతడి నమస్కారాన్ని అందుకుని స్టయిల్‌గానే నైట్‌క్వీన్ బార్‌లోనుంచి తృప్తిగా బయటకు వచ్చాడు.

ఆ రాత్రి బార్‌లో తన ప్రవర్తన తన పట్ల ఆ బేరర్ ప్రవర్తన తల్చుకుంటే శ్యామ్‌కు ఎంతో సంతోషం-తృప్తి కలిగాయి.

సరిగా వారంరోజుల తర్వాత మూన్‌లైట్ బార్‌లో తను సర్వ్‌చేసే టేబిల్ ఎదురుగా వున్న కుర్చీలో స్టయిల్‌గా కూర్చున్న వ్యక్తిని చూసి ముందు కొంచెం ఆశ్చర్యపోయాడు శ్యామ్.

అతనెవరోకాదు—నైట్‌క్వీన్ బార్‌లో వారంరోజుల క్రితం శ్యామ్‌కు సర్వ్ చేసిన బేరర్...

అతనుకూడా స్టయిల్‌కోసమే వచ్చి వుంటాడని అనుకున్నాడు శ్యామ్.

అతను శ్యామ్‌ను గుర్తుపట్టనట్టుగానే శ్యామ్ అతన్ని అడిగిన ప్రశ్నలకంటే ఎక్కువగానే రకరకాల అవసర అనవసర ప్రశ్నలను స్టయిల్‌గా అడిగాడు. శ్యామ్‌ని ఆ ప్రశ్నలతో తికమక చెయ్యాలనికూడా చూశాడు.

శ్యామ్ అతని ప్రశ్నలన్నింటికీ ఎంతో వినయంతోనే జవాబులు చెప్పి అతను కోరుకున్న రీతిలోనే అన్నింటినీ సర్వ్ చేశాడు.

చివరకు అతను వెళ్ళబోయేముందు వినయంగా నమస్కారంకూడా చేశాడు. అతను స్టయిల్‌గా తల ఆడించి హుందాగా బయటకు వెళ్ళిపోయాడు

అప్పుడు అతను ట్రేలోచూస్తే టిప్‌గా అతనికి ఆరురూపాయలు కనిపించాయి. వాటిని చూసి శ్యామ్ఇలాఅనుకున్నాడు.

"బార్‌లో బేరర్‌గా వీడికొచ్చే జీతానికి ఆరురూపాయలు టిప్‌కింద పడేసి వెళ్ళాడంటే వీడికి స్టైయిల్‌గా ఉండాలనే కోరిక నాకంటే ఎక్కువగానే ఉన్నట్టుంది ★